ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

సోమవారం 2 డిసెంబరు 2024

భవిష్యత్తుకు భరోసా.. ఫార్మసీ

కోర్సులతో మెండైన ఉపాధి అవకాశాలు

ప్రారంభమైన ప్రవేశాల ప్రక్రియ

32 కళాశాలలు.. 1481 సీట్ల కేటాయింపు

ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయనున్న ప్రభుత్వం



-వివరాలు 7లో...

సంక్రాంతికి కొత్త రేషన్ కార్డులు

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

మార్పులు, చేర్పులకు అవకాశం

వివాహ ధ్రువపత్రం చూపిస్తే కొత్తకార్డు



-వివరాలు 7లో...

డేటా భద్రమేనా..?

సొంత కంప్యూటర్లతో అనుమానాలు

తహసీల్దార్ కార్యాలయంలో పాడైన కంప్యూటర్లు

సొంత ల్యాప్‌టాప్‌లతో అధికారుల విధులు

భూముల వివరాల డేటా మొత్తం వారి గుప్పిట్లోనే

బదిలీ అయినా, సమాచారం లీక్ అయినా అంతే..!



మూలనపడ్డ కంప్యూటరు



కూడేరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో భూములకు సంబంధించిన డేటా భద్రతపై అనుమానాలు కలుగుతున్నాయి. ఇక్కడ కంప్యూటర్లు పని చేయకపోవడంతో అధికారులు సొంత ల్యాప్ టాప్‌లో ఆఫీసు ఫైళ్లు తయారు చేస్తున్నారు. దీంతో కార్యాలయం కీలక డేటా మొత్తం సంబంధిత అధికారులు తమ వద్దే ఉంచు కుంటున్నారు. ఆ అధికారి బదిలీ అయితే ల్యాప్‌టాప్‌తో పాటు అందులో ఉన్న సమా చారం కూడా అతడు తీసుకెళ్లే అవకాశం ఉంది. లేదా ల్యాప్‌టాప్‌లో సమాచారం లీక్ అయినా ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే మండ లంలో భూ వివాదాలు తీవ్రంగా ఉన్నా యి. మావోయిస్టులు ఉన్న సమయంలో రెవెన్యూ కార్యాలయంలో ఫైళ్లు కాలి పోయాయి. దీంతో భూముల సంబంధించిన కీలక ఫైళ్లు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పటి నుంచి భూముల వివరాలకు సంబంధించిన రికార్డులు లేక చాలా మంది రైతులు జిల్లా కేంద్రంలోని కార్యాల యాలకు వెళ్తున్నారు.

జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న కూడేరు మండలంలో భూముల విలువ భారీగా పెరిగిపోయింది. మండలంలోని గొట్కూరు, కమ్మూరు, బ్రహ్మణపల్లి, కూడేరు రెవెన్యూ గ్రామాల్లో అనంతపురం- బళ్లారి ప్రధాన రహదారి విస్తరించి ఉండటంతో భూముల ధరలు అమాంతం పెరిగాయి. అలాగే మండలంలో ప్రభుత్వ భూములు అత్యధికంగా ఉండటం అధికారు లకు కాసుల వర్షం కురుస్తోంది. భూమిలేని నిరుపేదలకు సాగు చేసుకోవ డానికి ప్రభుత్వం భూమి కేటాయిస్తోంది. వెంచర్లు వేయడా నికి రియల్టర్లు ఈ భూములను రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. వాటికి ఎన్‌ఓసీలు ఇవ్వడానికి రెవెన్యూ అధికా రులే ఫైళ్లు తయారు చేసి పంపుతున్నారు. ప్రభుత్వ భూము లను కేవలం వ్యవసాయానికి వినియోగించుకోవాల్సి ఉండగా, రియల్టర్ల చేతుల్లోకి వెళ్తున్నాయి. అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు ఎన్‌ఓసీలకు ఫైళ్లు పంపుతున్నారు. దీని వల్ల ఆయా అధికారులు అందినకాడికి సొమ్ము చేసుకుంటు న్నారు. ఇలాంటి ఫైళ్లతోపాటు మిగిలిన సమాచారం మొత్తం కార్యాలయంలోనే నిక్షిప్తం చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం సరఫరా చేసిన కంప్యూటర్లు పనిచేయకపోవ డంతో, కొందరు అధికారులు తమ సొంత కంప్యూటర్లతో పనులు చేస్తూ, సమాచారం మొత్తం నిక్షిప్తం చేసుకుంటు న్నారు. కార్యాలయ కంప్యూటర్లు పనిచేయకపోతే సంబం ధిత ఉన్నతాధికారులకు సమాచారం పంపి, తక్షణం వాటిని రిపేరీ చేయాల్సి ఉండగా, సొంత కంప్యూటర్లు వినియోగిం చడం అనుమానాలకు తావిస్తోంది. మండలంలో గతంలో పనిచేసిని అధి కారులు సొంత కంప్యూటర్లతో పని చేసి వాటిని తీసుకెళ్లారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన ఫైళ్లను అధికారులు సొంత కంప్యూటర్లతో తయారు చేసుకుంటూ డేటా మొత్తం వారి గుప్పెట్లో ఉంచుకున్నారు. ఉన్న తాధికారులు స్పందించి కార్యాలయంలోని కంప్యూటర్లలోనే ఫైళ్లు తయారు చేసే విధంగా ఆదేశించాల్సిన అవసరం ఉంది.

అతీగతీలేని నకిలీ ఎన్‌ఓసీ కేసు

భూముల ధరలు భారీగా పెరగడంతో కొందరు అధికారులు కాసులకు కక్కుర్తిపడి నకిలీ ఎన్‌ఓసీ సృష్టి కర్తలతో చేతులు కలిపి కేసులో ఇరు క్కున సంఘటనలు మండలంలో ఉన్నాయి. కమ్మూరు పొలంలోని 513 సర్వేనంబర్‌లోని1, 2, 3, లెటర్లలోని 12 ఎకరాల భూమికి నకిలీ ఎన్‌ఓసీ తో 22ఏ (1) నిషేధిత భూములను తొలగించి, రామాంజులరెడ్డి, వేణు గోపాల్‌రెడ్డిలు పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అలాగే మ్యూటేషన్‌కు దరఖాస్తు చేశారు. దాన్ని పరిశీలించిన ఆత్మకూరు తహసీల్దారు, కూడేరు ఇన్‌చార్జి తహసీల్దారు నకిలీ ఎన్‌ఓసీగా గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో తహసీల్దారు శ్రీనివాసులు, ఉరవకొండ డిప్యూటీ తహసీల్దారు గురుప్రసాద్, సబ్ రిజిస్ట్రార్ అధికారులతోపాటు మొత్తం 11 మంది నిందితులుగా తేలారు. ప్రభుత్వ అధికారులు అధి కంగా ఉండటంతో ఈ కేసును ఏసీబీకి బదిలీ చేశారు. అప్పటి నుంచి ఈ కేసులో ఎటువంటి పురోగతి కనిపించలేదు.

ఉన్నతాధికారులకు వివరిస్తాం

కూడేరు తహసీల్దారు కార్యాలయంలో పనిచేయని కంప్యూటర్ల గూర్చి ఉన్నతాధికారులకు వివరిస్తాం. ప్రస్తుతం ఉన్న కంప్యూటర్లతో పనులు చేస్తున్నాం. పనిచేయని కంప్యూటర్లు ఎన్నిఉన్నాయో పరిశీలించి వాటిని మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

-మహబూబ్‌బాషా, ఇన్‌చార్జి తహసీల్దారు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఘోర రోడ్డు ప్రమాదం

- ముగ్గురు దుర్మరణం
- మరొకరికి తీవ్రగాయాలు
- బాధితులందరూ బళ్లారికి చెందినవారే
- విడపనకల్లు మండల కేంద్రం వద్ద ఘోరం



డాక్టర్ గోవిందరాజులు



డాక్టర్ యోగేష్



వెంకటనాయుడు

విడపనకల్లు/బళ్లారి డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం తెల్లవారుజామున జరి గిన ఘోర రోడ్డు ప్రమాదంలో బళ్లారికి చెందిన ముగ్గురు డాక్టర్లు దుర్మరణం చెందారు. మృతుల్లో బళ్లారి విమ్స్ ఆసుపత్రికి చెందిన కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ ఈ. గోవింద రాజులు(52), కంటి వైద్య నిపుణులు డాక్టర్ యోగేష్(54), ఆయుర్వేదవైద్యులు(బీఏఎంఎస్) డాక్టర్ అమర గౌడ్, రాయల్ సిటీ ఆసుపత్రి నిర్వాహకుడు వెంకటనాయుడు(53) ఉన్నారు. పోలీసులు, మృతుల బంధువులు, తోటి వైద్యులు తెలిపిన మేరకు పాతస్నేహితులంతా కలిసి బ్యాంకాక్‌లో ఆత్మీయ సమావేశం కావాలని అనుకున్నారు. ఈక్రమంలో ఈనెల 26న మంగళవారం బళ్లారి నుంచి బయల్దేరారు. డాక్టర్ గోవిందరాజులు కారులో మిగతా ముగ్గురు స్నేహితులు కలిసి బెంగళూరుకు వెళ్లారు. అక్కడ కారు పెట్టి విమా నంలో బ్యాంకాక్‌కు వెళ్లారు. ఆదివారం రాత్రి 12.30 గంటలకు బెంగళూరు విమానాశ్రయంలో దిగి కారులో బళ్లారికి అనంతపురం మీదుగా బయల్దే రారు. ఇంటికి మరో 40 నిమిషాల్లో చేరుకుంటారనుకునేలోపే వీరిని మృత్యువు ప్రమాదం రూపంలో వెంబడించింది. వీరు ప్రయాణిస్తున్న కారు విడపనకల్లు సమీపంలో సిద్ధార్థ పెట్రోల్ బంక్‌కు దగ్గర్లో బళ్లారి వైపు వచ్చే దారిలో రోడ్డు పక్కన వేపచెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జు అయింది. కారు వేగంగా ఢీకొనడంతో చెట్టు కూడా మొదలుకు విరిగి పోయింది. కారును గోవింద రాజులు నడుపుతుండగా పక్కన మరో డాక్టర్ యోగేష్ కూర్చోగా, మిగిలిన ఇద్దరు వెనుక సీటులో కూర్చున్నారు.

ప్రమాద సమాచారం తెలిపిన జీపీఎస్

ప్రమాదం జరిగిన వెంటనే డాక్టర్ గోవిందరాజులు ఐఫోన్ నుంచి ఆయన భార్య రచన ఫోన్‌కు అలర్ట్ మెసేజ్ వెళ్లింది. వెంటనే ఆమె అప్రమత్తమై ఫోన్ చేశారు. ఫోన్ రింగ్ అవుతున్నా లిఫ్ట్ చేయ లేదు. అనుమానం వచ్చిన ఆమె బళ్లారి నుంచి కారులో తన కుమార్తెతో పాటు జీపీఎస్ లొకే షన్ ఆధారంగా ప్రమాద స్థలికి చేరుకున్నారు. చీకటిగా ఉండటం, పొగ మంచు ఎక్కువగా ఉండటంతో ఎక్కడ ప్రమాదం జరిగిందో కనిపించం లేదు. దీంతో ఆమె అక్కడే ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి విచారిం చారు. పోలీసులనూ విచారించారు. అప్పటికి ఎవరికీ విషయం తెలియ లేదు. దీంతో ఆమె మళ్లీ ఫోన్ జీపీఎస్ లొకేషన్ ఆధారంగా వెతుక్కుంటూ వెళ్లి పొలాల్లో పడిపోయిన కారును గుర్తించారు. ఆమే మిగిలిన విమ్స్ డాక్ట ర్లకు కూడా సమాచారం చేరవేడంతో వారంతా అక్కడికి వచ్చారు. కొన ఊపిరితో ఉన్నారని ఆశించి విమ్స్ ఆసుపత్రికి తరలించారు. ముగ్గురు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన అమరేగౌడ పాటిల్‌కు వైద్యం అందిస్తున్నారు. మృతుడు డాక్టర్ ఇ. గోవిందరాజులు భార్య రచన, డాక్టర్ యోగేష్ భార్య విమ్స్‌లోని డెంటల్ విభాగంలో అసో సియేట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్నారు.

ప్రమాదానికి కారణం పొగమంచా..? నిద్రమత్తా..?

రోడ్డు ప్రమాదం పొగ మంచు కారణంగా జరిగిందా? లేక అతి వేగం, నిద్రమత్తులో జరిగిందా అని పోలీసులు విచారణ చేట్టారు. కారు చెట్టును ఢీ కొన్న సంఘటనను గమనిస్తే కారు ముందు భాగం నుజ్జు నుజ్జైంది. కారులోని బెలూన్లు తెరుచుకున్నా అవి కూడా లోపలే పగిలి పోయాయి. ముందు కూర్చున్న ఇద్దరు కారులో ఇరుక్కుపోయి మృత దేహాలు గుర్తు పట్టలేనంతగా మారి పోయాయి. ప్రమాద సమయంలో రోడ్డుపై ఎక్కడా బ్రేకులు వేసినట్లు కనిపించలేదు. వేగంగా వెళ్లి చెట్టును ఢీ కొట్టినట్లు సంఘటన స్థలంలో కనిపిస్తోంది. ఈ విషయమై సీఐ చిన్న గౌస్ కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

తాడిపత్రిలోనే మీటింగ్ పెడతా

తాటాకు చప్పుళ్లకు భయపడం

ధైర్యముంటే

నా, నీ ఆస్తులపై విచారణ కోరు

జేసీపీఆర్ వ్యాఖ్యలపై వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'జేసీ ప్రభాకర్ రెడ్డి..! మీ తాటాకు చప్పుళ్లకు భయపడం. నిర్భయంగా, ప్రజాస్వామ్యబద్ధంగా మాట్లాడతా. వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా తాడిపత్రిలోనే పార్టీ మీటింగ్ పెడతా. పశువులు, జంతువుల కన్నా హీనంగా ప్రవర్తిస్తే సహించేది లేదు. ప్రాణాలుంటే ఉంటాయ్. లేకుంటే పోతాయ్. మాఫియాకు తానివ్వం' అంటూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి విరుచుకుపడ్డారు. రెండురోజుల కిందట తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలపై 'అనంత' విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన తల్లిదండ్రులు తనకు సంస్కారం నేర్పారన్నారు. ప్రజాప్రతినిధిగా ఉన్నా లేకపోయినా ఒకే రకంగా ఉన్నామని, గెలిచినప్పుడు విర్రవీగలేదని, ఓడిపోయాక కుంగిపోలేదన్నా రు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయలేదని, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇసుక, మ ట్టి, మద్యం, బూడిద వ్యాపారంలో ఉన్నారని చెప్పానని ఇవన్నీ పత్రికల్లో వచ్చినవేనన్నారు. కానీ సభ్యసమాజం తలదించుకునేలా, వావివరసలు లేకుండా వ్యక్తిగతంగా మాట్లాడటం జేసీపీఆర్‌కు తగదన్నారు. తాను భూములు కాజేశానని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పుడు కేం ద్రం, రాష్ట్రంలో మీరే అధికారంలో ఉన్నా రు. మీరు చేసిన ఆరోపణలపై విచారణ చేయండి సహకరిస్తానన్నారు. నిజాయతీ ఉంటే మీ కుటుంబ ఆస్తులపై విచారణ కోరాలన్నారు. తనను ఇంటి కొచ్చి కొడతామంటున్నారే, కొట్టడం అంత సులభంగా ఉంటుందా అని ప్రశ్నించారు. ఐదు మార్లు ప్రజాప్రతినిధిగా గెలిచాను, ఓడిపోయాను. ఓడిపోతే ఏ రోజూ ఊరు విడిచి వెళ్లలేదన్నారు. 1996లో మీరంతా ఊరు విడిచి బెంగళూరుకు వెళ్లిపోతే రఘువీరా రెడ్డి, తాను పోరాడామన్నారు. మీలా తాము హైదరాబాద్, బెంగళూరుకు పారిపోలేదన్నారు.

యాడికిలో రేషన్ డీలర్ల మధ్య వివాదం

నిలిచిపోయిన పంపిణీ

యాడికి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): డీలర్ల మధ్య నెల కొన్న వివాదం కారణంగా యాడికిలో ఆదివారం రేషన్ పంపిణీ నిలిచిపోయింది. రేషన్ దుకాణం నెంబరు-10కి 366 కార్డులు ఉన్నాయి. వీటికి తిప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన డీలర్ ఆదినారాయణ రేషన్ పంపిణీ చేస్తున్నాడు. ఈ దుకాణానికి చెందిన కార్డుదారులు తిప్పారెడ్డిపల్లితోపాటు యాడికిలో కొందరు ఉంటున్నారు. సివిల్‌సప్లై అధికారుల ఆదేశాలతో ఆదినారాయణ యాడికిలో ఉన్న తన రేషన్ షాపు లబ్ధిదారులకు ఆదివారం బియ్యం పంపిణీ ప్రారంభించాడు. విషయం తెలుసుకున్న యాడికిలోని కొందరు డీలర్లు ఆదినారాయణ వద్దకు వెళ్లి వాగ్వాదానికి దిగారు. యాడికిలో బియ్యం పంపిణీ చేయడానికి నువ్వుఎవరు? ఇక్కడ నువ్వు బియ్యం పంపిణీ చేయకూడదు, అంటూ బియ్యం పంపిణీని నిలిపివేశారు. దీనిపై రేషన్ డీలర్ ఆదినారాయణ మాట్లాడుతూ అధికారుల ఆదేశాలతోనే నేను బియ్యం పంపిణీ చేస్తున్నానని మీరు ఎలా అడ్డుకుంటారని ప్రశ్నించాడు. దీంతో డీలర్ల మధ్య వివాదం పెద్దదైంది. రేషన్ పంపిణీ వద్ద పెద్దఎత్తున జనాలు గుమిగూడారు. డీలర్లు అంతా టీడీపీ వారే కావడంతో సమస్య మరింత పెద్దది అయితే పార్టీ పరువు బజారున పడుతుందని, సోమవారం అధికారులు వచ్చాక దీనిపై మాట్లాడదామని అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిపై సీఎస్‌డీటీ మారుతిప్రసాద్‌రెడ్డిని వివరణ కోరగా బఫర్ స్టాక్ పూర్తి అయ్యేంతవరకు ఆదినారాయణను రేషన్ బియ్యం పంపిణీ చేయమని తెలిపామని, అయితే యాడికిలోని డీలర్లు దీన్ని అడ్డుకున్నారన్నారు. స్థానిక వీఆర్వోకు ఫోన్‌చేస్తే అందుబాటులోకి రావడం లేదని సోమవారం సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



వివాదంతో రోడ్డుపైనే బియ్యాన్ని ఉంచిన దృశ్యం

అధికారులు చెబితేనే...



సివిల్‌సప్లై అధికారులు బియ్యం పంపిణీ చేయమంటేనే నేను తిప్పారెడ్డిపల్లి గ్రామం నుంచి యాడికి ట్రాక్టర్‌లో తీసుకొని వచ్చి లబ్ధిదారులకు అందజేస్తున్నా. యాడికిలోని కొందరు డీలర్లు వచ్చి గొడవపెట్టుకున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లా. ఎంతో వ్యయ ప్రయాసాలకోర్చి సొంత ఖర్చులతో తిప్పారెడ్డిపల్లి నుంచి యాడికి రేషన్ బియ్యం తీసుకువచ్చా. పంపిణీని డీలర్లు అడ్డుకోవడం మంచి పద్ధతికాదు. అధికారుల ఆదేశాలతోనే బియ్యం పంపిణీ చేస్తున్నా.

- ఆదినారాయణ, రేషన్ డీలర్

హెచ్చెల్సీలో బాలుడి గల్లంతు

అమ్మ పుట్టిన రోజు ఆనందం ఆవిరి

బుక్కరాయసముద్రం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): అమ్మ పుట్టిన రోజని ఆ పిల్లాడు ఎంతో సంబరపడ్డాడు. అమ్మతో కేక్ కట్ చేయించి, పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పాడు. అనంతరం ఆడుకునేందుకు స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడు. ఎంతో సందడిగా ఉన్న ఆ ఇంట్లో ఆనందం అంతలోనే ఆవిరైంది. ఇంత వరకు తమతో ఉల్లాసంగా గడిపిన బిడ్డ హెచ్చెల్సీలో గల్లంతయ్యాడని తెలియడంతో ఆ తల్లితో పాటు తండ్రి అల్లాడిపోయారు. ఈ సంఘటన మండలంలోని శర్మకాలనీ వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం గ్రామ పంచాయతీలోని ఐలమ్మ కాలనీకి చెందిన మనోహర్, పద్మావతి దంపతుల కుమారుడు మోహన్‌సాయి(10) స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు ఆదివారం సెలవు కావడంతో ఇంటికి సమీపంలో ఉన్న హెచ్చెల్సీ వద్దకు తన స్నేహితుడు వరుణ్‌తేజతో కలిసి వెళ్లాడు. వరుణ్ తేజకు ఈత రాగా, మోహన్‌సాయికు ఈత రాదు. అదే కాలనీకి చెందిన పిల్లలు ఈతకొడుతుండగా మోహన్‌సాయి కాలువలోకి దిగాడు. కాలువలో నీరు లోతు ఎక్కువగా ఉండటంతో మునిగిపోయాడు. ఇది గమనించిన స్నేహితుడు వరుణ్‌తేజ మునిగిపోయిన మోహన్ సాయిని రక్షించేందుకు ప్రయత్నం చేశాడు. నీటి వేగం ఎక్కువగా ఉండటంతో బయటికి తీసుకుని రాలేకపోయాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, స్థానికులు, పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది మోహన్‌సాయి కోసం రాత్రి 8 గంటల వరకు కాలువ వెంబడి గాలించారు. అయినా ఆచూకీ లభించలేదు. ఈ సంఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





గాలింపు చేపట్టిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, మోహన్‌సాయి(ఫైల్)

అవగాహనే హెచ్‌ఐవీకి మందు

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతలో భారీ ర్యాలీ

అనంతపురం టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌ను నివారించవచ్చని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కాలేజ్‌వద్ద ర్యాలీని ప్రారంభించారు. టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్ మీదుగా డీఎంహెచ్‌ఓ ఆఫీస్ వరకు ఈర్యాలీ కొనసాగింది. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ హెచ్‌ఐవీ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. నిమిషం సుఖం కోసం వందేళ్ల జీవితాన్ని నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు సైతం ఈహెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించడానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. బాధితుల సంరక్షణకు అనేక రకాల మందులు, పౌష్టికాహారం ఉచితంగా అందిస్తుండటంతో పాటు పింఛన్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీదేవి మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల ప్రజలకు అవగాహన పెంచడంతో పాటు, బాధితులకు బాసటగా నిలిచేందుకే ప్రతిఏటా డిసెంబరు1న ఎయిడ్స్‌డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్లు కొగటం విజయభాస్కర రెడ్డి, వాసంతిసాహిత్య, జిల్లా ఎయిడ్స్ నివారణ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టరు అనుపమ జేమ్స్, డాక్టరు గంగాధరరెడ్డి, డాక్టరు సుజాత, డాక్టరు నారాయణ స్వామి, డాక్టరు ఓబులు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఎయిడ్స్ విభాగం సూపర్‌వైజర్ జీవీరమణ, డెమోలు త్యాగరాజు, గంగాధర్‌తోపాటు పలువురు డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంపీ, జడ్పీ చైర్‌పర్సన్, డీఎంహెచ్‌ఓ తదితరులు

అవార్డు గ్రహీతలకు సత్కారం

హెచ్‌ఐవీ బాధితులకు అందిస్తున్న సేవలకుగాను రాష్ట్రస్థాయిలో ఉమ్మడి జిల్లాకు నాలుగు అవార్డులు దక్కాయని డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీదేవి తెలిపారు. పరీక్షల నిర్వహణలో అనంతపురం ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్, హెచ్‌ఐవీ బాధితులకు ఉత్తమసేవలు అందించినందుకు డాక్టరు సత్యనారాయణకు, తల్లి నుంచి బిడ్డలకు హెచ్‌ఐవీ సంక్రమించకుండా తీసుకుంటున్న చర్యలకు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి, రక్తసేకరణ, అధిక రక్తదాన శిబిరాలు నిర్వహించినందుకు హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రి రక్తనిధికి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు లభించినట్లు పేర్కొన్నారు. ఈ అవార్డు గ్రహీతలను ఆదివారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేసి డీఎంహెచ్‌ఓ, ఇతర వైద్యాధికారులు అభినందించారు.

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ.33



అనంతపురం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 33తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 975 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 26, కనిష్ఠ ధర రూ. 20 పలికినట్లు ఆయన తెలిపారు.

ఓపీఎస్ పునరుద్ధరణ కోరుతూ 10న చలో విజయవాడ

అనంతపురం విద్య, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని ఈ నెల 10న చలో విజయవాడ నిర్వహించనున్నట్లు ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాలలో చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు ప్రేమనాథరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తానంటూ హామీ ఇచ్చి ఉద్యోగులను నిలువునా మోసం చేసిందన్నారు. ఉద్యోగులపై అక్రమ కేసులు పెట్టిందని మండిపడ్డారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు సీపీఎస్ విధానంపై ఏడాదిలో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారని, నారా లోకేష్ సైతం ఉద్యోగులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేస్తామని అసెంబ్లీలో ప్రకటించారని గుర్తుచేశారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయడం రాజ్యాంగ హక్కు అని పేర్కొన్నారు. సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే చలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్న, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మనోహర్, భాగ్యరాజ్, శివశంకర్‌రెడ్డి, రామాంజనేయులు, గోపాల్‌రెడ్డి, రంగనాథ్, భాష, సుధాకర్ పాల్గొన్నారు.

వాహన్, సారథి పోర్టల్ ద్వారా దరఖాస్తులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ అన్ని సేవలకు ఈనెల 3వతేదీ నుంచి వాహన్ లేదా సారథి పోర్టల్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి వీర్రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నుంచి ఈ ప్రగతి పోర్టల్‌లో రవాణా శాఖ సేవలను నిలిపివేస్తామన్నారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన కీట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టాలీప్రైమ్, జీఎస్టీ, అడ్వాన్స్ ఎక్సెల్ కోర్సుల్లో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణ కల్పిస్తామని ఉన్నతి కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. బీకాం, ఎంకాం చదివి 20-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు విజయవాడలో 60 రోజుల పాటు ఉచిత శిక్షణ, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ కోర్సులో అదనంగా కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు నెలకు రూ. 18వేలకు పైగా వేతనంతో కూడిన ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 9000487423ను సంప్రదించాలని కోరారు.

1.681 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.681 టీఎంసీల నీటి నిల్వ వున్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో ఇన్‌ఫ్లో 861 క్యూసెక్కులుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 798 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

భవిష్యత్తుకు భరోసా... ఫార్మసీ

- కోర్సులతో మెండైన ఉపాధి అవకాశాలు
- ప్రారంభమైన ప్రవేశాల ప్రక్రియ
- 32 కళాశాలలు, 1481 సీట్ల కేటాయింపు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయనున్న ప్రభుత్వం



జేఎన్‌టీయూ ముఖద్వారం

కోర్సులు, జిల్లాల వారిగా సీట్ల సంఖ్య వివరాలు

కోర్సులు	అనంతపురం	చిత్తూరు	కడప	కర్నూలు	నెల్లూరు
బి.ఫార్మసీ	128	240	224	85	520
డాక్టర్ ఆఫ్ ఫార్మసీ	30	65	52	13	91
ఫుడ్ టెక్నాలజీ	33				
మొత్తం	158	338	276	98	611

జిల్లాలో కళాశాల వారిగా కన్వీనర్ కోటా సీట్ల సంఖ్య

కళాశాల	బీ.ఫార్మసీ	డాక్టర్ ఆఫ్ ఫార్మసీ
జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ	55	17
ఎస్కేయూ	33	--
బాలాజీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ	40	13
మొత్తం	128	30

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశానికి రాష్ట్ర ప్రభుత్వం తొలి విడత వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించింది. ఏపీ ఈఏపీసెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థులు అడ్మిషన్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ నెల 6వరకు రిజిస్ట్రేషన్, పేమెంట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియలు కొనసాగుతాయి. ఈ ప్రక్రియలు పూర్తిచేసిన విద్యార్థుల సర్టిఫికెట్లను ఆన్‌లైన్ ద్వారానే కౌన్సెలింగ్ సెంటర్‌లో పరిశీలిస్తారు. ఏడో తేదీవరకు కళాశాలల ఎంపిక కోసం వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలి. ఆప్షన్లలో ఏవైనా మార్పులు చేసుకోవడానికి 8న అవకాశాన్ని కల్పించారు. కౌన్సెలింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థులకు 11న సీట్లను కేటాయిస్తారు. అదేరోజు నుంచి 14వరకు సబంధిత కళాశాలలో సెల్ఫ్ రిపోర్టు చేసుకోవాలి. విద్యార్థుల సహాయార్థం అనంతపుర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. వివరాలకు 7901620145 నెంబర్‌కు ఫోన్‌చేయాలని కౌన్సెలింగ్ సెంటర్ అడ్మిన్ సుధారాణి సూచించారు.

32 కళాశాలలు, 1481 సీట్లు..

ఈఏపీసెట్ ప్రథమ ఫార్మసీ కౌన్సెలింగ్ ద్వారా జేఎన్‌టీయూ పరిధిలోని ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాలోగల 31 ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. కన్వీనర్ కోటాకింద మొత్తం 1448 సీట్లు ఉన్నాయి. ఎస్కేయూ ఫార్మసీ కళాశాలలో 33 సీట్లున్నాయి. ఈ లెక్కన మొత్తం 32 కళాశాలలు, 1481 సీట్లు ఉన్నాయి. వీటిలో బీఫార్మసీ 1197, ఫార్మా-డీ 251, ఫుడ్ టెక్నాలజీ 33 సీట్లను కేటాయించారు. జేఎన్‌టీయూ కలికిరి ఇంజనీరింగ్ కళాశాలలో మాత్రమే ఫుడ్‌టెక్నాలజీ కోర్సు ఉంది. ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన ఎంపీసీ, బైపీసీ రెండు స్ట్రీమింగ్‌ల విద్యార్థులు కౌన్సెలింగ్‌కు అర్హులు.

కళాశాల వారిగా ఫీజులు...

అనంతపురం ఉమ్మడి జిల్లాలో మూడు ఫార్మసీ కళాశాలలకు మొదటి విడత కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్ ప్రక్రియను చేపట్టారు. జిల్లా కేంద్రంలో జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ, ఎస్కేయూ, బాలాజీ ఫార్మసీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 128 బీ-ఫార్మసీ, 30 డాక్టర్ ఆఫ్ ఫార్మసీ మొత్తం 158 సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. అర్హత గల విద్యార్థులకు కళాశాల వారిగా ఫీజులను రాష్ట్ర ప్రభుత్వమే ఫీజురీయింబర్స్‌మెంట్ ద్వారా చెల్లిస్తుంది. బాలాజీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో బీఫార్మసీకి రూ.50700, డాక్టర్ ఆఫ్ ఫార్మసీకి రూ.38000. జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ కళాశాలలో బీఫార్మసీకి రూ.31000, డాక్టర్ ఆఫ్ ఫార్మసీకి రూ.35000. ఎస్కేయూ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీకి రూ.50000 చొప్పున ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తుంది.

రూ.6.93కోట్లు చెల్లించనున్న ప్రభుత్వం

మొదటి విడత కౌన్సెలింగ్ ద్వారా కన్వీనర్ కోటాలో 1481 సీట్లను భర్తీ చేయనున్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. ల్యాబ్‌లు, సౌకర్యాలు, మెరుగైన వసతులు ఇలా ప్రామాణికతను బట్టి ఆయా కళాశాలలకు ప్రభుత్వం ఫీజులను నిర్ధారణ చేసింది. ఒక్కో కళాశాలకు రూ.30వేల నుంచి రూ.80వేలకు కోర్సు ఫీజును నిర్ధారించింది. ఈ లెక్కన మొత్తం 1481 సీట్లు భర్తీ అయితే రూ.6.93కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని సంబంధిత కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించనుంది.

ఫార్మసీ ఎవర్‌గ్రీన్



ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంలో ఇంజనీరింగ్‌తో పాటు ఫార్మసీ కోర్స్ ఎవర్‌గ్రీన్‌గా నిలుస్తోంది. నాలుగు సంవత్సరాల బీఫార్మసీ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు ఉద్యోగాలకు వెళ్తున్నారు. వర్సిటీలో ప్రత్యేకంగా ప్లేస్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటుచేశాం. జేఎన్‌టీయూ పరిధిలోని అన్ని ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు కోర్సు చివరి సంవత్సరంలోనే క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు.

\- ప్రొఫెసర్ సుదర్శనరావు, జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ

స్వయం ఉపాధి



ఫార్మసీ విద్యార్థులకు రెండు వైపులా అవకాశాలున్నాయి. ఉద్యోగులుగా చేరడానికి, స్వయం ఉపాధి పొందడానికి మెండైన అవకాశాలు ఉన్నాయి. ప్రముఖ జాతీయ సంస్థలైన మెడ్‌టెక్, అపోలో వంటి సంస్థల్లోనూ, స్థానికంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఫార్మాసిస్ట్ ఉద్యోగాలు లభిస్తాయి. విద్యార్థి తన ప్రాంతంలో మెడికల్ షాపులను ఏర్పాటుచేసుకుని కూడా స్వయం ఉపాధిని పొందవచ్చు.

\- డాక్టర్ సోమశేఖర్, ఎస్కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్

జాబ్ అస్యూరెన్స్



ఫార్మసీ విద్యార్థులకు పక్కాగా ఉద్యోగ భరోసా ఉంటుంది. కోర్సు పూర్తి చేసిన వెంటనే ఫార్మసీ ఇండస్ట్రీలో క్వాలిటీ కంట్రోల్, ప్రొడక్షన్, ఆర్అండ్‌డీ ఇలా వివిధ డిపార్ట్‌మెంట్స్‌లో ఉద్యోగాలు లభిస్తాయి. ఫార్మసీ పరిశ్రమలు తయారు చేసిన మందులను మార్కెట్‌లో అమ్మడానికి మెడికల్ రెప్రజెంటేటివ్స్‌గా అవకాశాలున్నాయి. ఇన్ని అవకాశాలు ఒక్క ఫార్మసీ కోర్సుతోనే దక్కుతాయి.

\- డాక్టర్ శ్రీధర్, బాలాజీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్

సీఎం పర్యటనతో అభివృద్ధికి మార్గం

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



రాయదుర్గంటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనతో రాయదుర్గం సమగ్రాభివృద్ధికి మార్గం ఏర్పడిందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాకు అవసరమైన హంద్రీనీవా తొలిదశ పనులు పూర్తికి స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. మల్యాల నుంచి జీడిపల్లి వరకు కాలువ విస్తరిస్తామని ప్రకటించారని అన్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాలకు అత్యంత ప్రాముఖ్యత కలిగిన జీడిపల్లి, భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తరలించే కార్యక్రమాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. 36ఎ కింద ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో 64 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు హామీ ఇచ్చారని తెలిపారు. తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణకు రూ. 600 కోట్లు నిధులు మంజూరు చేస్తామని చెప్పారన్నారు. తుంగభద్ర జలాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడానికి ఉంతకల్లు - నేమకల్లు గ్రామాల మధ్యలో ఐదు టీఎంసీల సామర్థ్యంతో నేమకల్లు ఆంజనేయస్వామి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించేందుకు ఆమోదం తెలిపారని అన్నారు. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో 20 వేల ఎకరాల్లో విస్తరిస్తున్న ఇసుకమేటల నివారణకు శాస్త్రీయంగా అధ్యయనం చేయించి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నేమకల్లును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారన్నారు. డి.హీరేహాళ్ మండలంలో మూడువేల ఎకరాల్లో స్టీల్ పరిశ్రమల పార్క్ మంజూరుకు అంగీకరించారన్నారు. పండ్లతోటల హబ్‌గా మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరునెలల పాలనలో ఏ నియోజకవర్గానికి ఇవ్వలేనన్ని హామీలు రాయదుర్గానికి ఇచ్చారని పేర్కొన్నారు. బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్ట గ్రామానికి హెచ్చెల్సీ జలాలను మళ్లించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేస్తూ రైతులు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బొమ్మనహాళ్ మండల కన్వీనర్ బలరామిరెడ్డి, టీడీపీ నాయకులు పూజారి శివ, బండి చిన్న, పసుపులేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి కొత్త రేషన్ కార్డులు

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

మార్పులు, చేర్పులకు అవకాశం

అనంతపురం టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు సంక్రాంతి పండుగకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మేరకు సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కొత్తరేషన్ కార్డుల జారీతో పాటు పాతకార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. రేషన్ కార్డుల కోసం గత ఐదేళ్లుగా ఎదురు చూస్తున్న పేదలు కూటమి ప్రభుత్వ నిర్ణయంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా సాగింది. సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకున్న కొన్ని గంటలకే రేషన్‌కార్డులు ఇస్తామని అప్పటి సీఎం జగన్ గొప్పలు చెప్పారు. ఐదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోగా.. పథకాల లబ్ధి కోసం రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పులకు కూడా అవకాశం కల్పించలేదు. దీంతో ఐదేళ్లుగా పేదలు రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. అలాంటి వారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుభవార్త ప్రకటించారు. సచివాలయాల్లో ఈనెల 28వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.

వివాహ ధ్రువ పత్రం చూపిస్తే కొత్తకార్డు

అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు 6.62 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇంకా చాలా మంది కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇందులో కొత్త జంటలకు కొత్త రేషన్ కార్డులు జారీచేయనున్నారు. వివాహ ధ్రువపత్రం దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా పరిశీలించి అర్హత ఉన్న కొత్తజంటలకు నూతన రేషన్ కార్డులు జారీచేస్తారు. సంక్రాంతి పండుగకు అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి:

వెంకటేశ్వర్లు, డీఎస్ఓ

కొత్త రేషన్‌కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం సోమవారం నుంచి సచివాలయాల్లో దరఖాస్తులను తీసుకుంటారు. మార్పులు, చేర్పులకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తులను పక్కాగా పరిశీలించిన అనంతరం అర్హులందరికి కొత్తకార్డులు మంజూరు చేస్తాం. సంక్రాంతి పండుగకు నూతన రేషన్‌కార్డులు అందించే అవకాశం ఉంది. అర్హత ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలి.

చెలరేగిన దొంగలు

ఒకేరోజు ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

కాపర్ వైరు చోరీ...

చోద్యంచూస్తున్న పోలీసులు



రంగమ్మ తోటలో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

యాడికి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కేబుల్ వైర్ల దొంగలు చెలరేగిపోయారు. యాడికి మండలం చందన గ్రామంలో శనివారం రాత్రి దొంగలు ముగ్గురు రైతుల తోటల్లో ఐదు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ వైరును చోరీ చేశారు. చందన గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి, రంగమ్మ, రంగారెడ్డి మొక్కజొన్న, అరటి పంటలను సాగుచేశారు. శనివారం రాత్రి తోటల్లో దొంగలు పడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్లకు కరెంట్ కనెక్షన్‌లు కట్‌చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం తోటల వద్దకు వెళ్లిన రైతులు తమ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేసి దోచుకెళ్లడం చూసి లబోదిబోమన్నారు. పంటలకు సాగునీరు అందించేది ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను ఇక ఎండ బెట్టుకోవాల్సిందేనా అంటూ కన్నీరుకార్చారు. తమకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చేదెప్పుడు...? సాగుచేసిన పంటలు కాపాడుకొనేది ఎప్పుడూ అంటూ వాపోయారు. ఇప్పటి వరకు దైవాలమడుగు గ్రామంలో దొంగలు వరుసగా కేబుల్ వైర్లు దొంగతనం చేసి రైతులను నష్టపరిచారు. ఇప్పుడు ఏకంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు పగులగొట్టారు.

అసలు పోలీసులు ఉన్నారా..?

యాడికి మండలంలో అసలు పోలీసులు ఉన్నారా? అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంతమంది రైతుల కడుపుకొట్టి దొంగలు యథేచ్ఛగా చోరీలు చేస్తుంటే పోలీసులు ఏమిచేస్తున్నట్లు అని మండల రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తోటల్లో దొంగతనం జరిగిందని రైతులు ఎవరైనా పోలీస్‌స్టేషన్‌కు వెళితే.. వారి సూటిపోటి మాటలతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్లు రైతులు తెలిపారు. వ్యవసాయ తోటలో జరుగుతున్న కేబుల్‌వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడమే మానుకున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా జరుగుతున్న కేబుల్‌వైర్ల చోరీ, ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తున్న సంఘటనలతో పోలీసు వ్యవస్థపై మండల రైతాంగం నమ్మకం కోల్పోయిందనడంలో సందేహం లేదు.

ఇంటి ఎదుట శవంతో నిరసన

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కారణమైన వ్యక్తి

ఇంటి వద్ద బంధువుల ఆందోళన





మృతికి కారణమైన వ్యక్తి ఇంటి ఎదుట శవంతో బంధువుల నిరసన, శివ (ఫైల్)

కూడేరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చోళసముద్రం గ్రామ సమీపం తోటలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌లో హెడ్ ఫ్యూజులు వేస్తూ, విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన కురుబ చిట్రా శివ (28) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గత నెల 2న చోళసముద్రం గ్రామానికి చెందిన నాపా నాగరాజు తోటలో ట్రాన్స్‌ఫార్మర్‌కు హెడ్ ఫ్యూజులు పోయాయి. దీంతో కరెంటు ఆఫీసు నుంచి ఎల్‌సీ తీసుకున్నానని చెప్పి ఫ్యూజులు వేయడానికి గ్రామానికే చెందిన కురుబ చిట్రా శివను తోటకు తీసుకెళ్లాడు. నాగరాజు చెప్పిన మాటలు విని శివ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కాడు. అయితే ఆ సమయంలో కరెంటు సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన శివను వెంటనే అనంతపురం తరలించారు. నెల రోజులు పాటు మృత్యువుతో పోరాడి ఆదివారం మృతి చెందాడు. దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, బంధువులు మృతికి కారణమైన నాపా నాగరాజు ఇంటి వద్ద శవంతో నిరసనకు దిగారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని బాధితులతో చర్చించారు. మృతుడికి భార్య ఆశతో పాటు ఆరు నెలల చిన్నారి ఉండటంతో న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. మృతికి కారణమైన వ్యక్తి వచ్చే వరకు శవం తరలించేది లేదని పోలీసులకు తేల్చి చెప్పారు. దీంతో పోలీసులు శాంతి భద్రతలు సమస్య రాకుండా బందోబస్తు నిర్వహించారు.

వడ్డెర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక

ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కుంచెపు వెంకటేష్

పలువురు శుభాకాంక్షలు



కుంచెపు వెంకటేష్‌ను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా వడ్డెర్ల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఐదో రోడ్డులోని సాయిబాబా ఆలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వడ్డెర్ల సంఘం అధ్యక్షుడిగా కుంచెపు వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా హనుమయ్య, ఉపాధ్యక్షులుగా నాగరాజు, శ్రీనివాసులు, కోశాధికారిగా పెద్దమారెప్ప, కార్యదర్శిగా వెంకటపతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుధాకర్, సహాయ కార్యదర్శులుగా నారాయణస్వామి, శ్రీరాములు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడికి పలువురు నాయకులు, వడ్డెర్లు పూల మాలలు వేసి, శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి, ఇతర నాయకులు, వడ్డెర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో వడ్డెర్ల సంక్షేమం కోసం నిరంతరంపాటు పడతా అన్నారు. ప్రభుత్వం నుంచి వడ్డెర్లకు దక్కాల్సిన లబ్ధిని చేకూరేలా కృషి చేస్తా అన్నారు. వడ్డెర్లు అందరూ ఐకమత్యంతో ఉన్నప్పుడే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో వడ్డెర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి అంజినప్ప, నగర అధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు ఆంజనేయులు, మునిస్వామి, నాగేంద్ర, శేఖర్, రాజు, పెద్దన్న, రవీంద్ర, లక్ష్మీదేవి, ముత్యాలమ్మ, రామాంజినేయులు, మంజునాథ్ పాల్గొన్నారు.

జీసీటీఏ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక సంఘం (జీసీటీఏ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ కోనంకి శ్రీధర్, బాలాజీ నాయక్ ఎన్నికయ్యారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాలలో సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 75 మంది అధ్యాపకులు ఓటును వినియోగించుకున్నారని రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించిన పెనుకొండ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు జయప్ప తెలిపారు. 50 ఓట్లు శ్రీధర్‌కురాగా, వెంకటేష్‌కు 25 ఓట్లు పడ్డాయని తెలిపారు. దీంతో శ్రీధర్ ప్యానెల్ జిల్లా కార్యదర్శిగా బాలాజీ నాయక్, ట్రెజరర్‌గా నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. అధ్యాపకుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామని శ్రీధర్, బాలాజీనాయక్ తెలిపారు. అనంతర నూతన కార్యవర్గానికి పలువురు అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

పీఆర్టీయూ శ్రీసత్యసాయి జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి

అనంతపురం విద్య, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ శ్రీసత్యసాయి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ స్కూలులో పీఆర్టీయూ ఉమ్మడి అనంతపురం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకుడు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో జిల్లా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం నూతన పీఆర్సీ ప్రకటించాలని, 30 శాతం ఐఆర్ వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రజనీకాంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, తిమ్మారెడ్డి శ్రీరాములు, నరసింహులు, రంగారెడ్డి, చంద్రశేఖర్, రామిరెడ్డి, ఉమాదేవి తదతరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురంరూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్ల మరమ్మతుల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ టౌన్-2 డీఈఈ శ్రీనివాసులు తెలిపారు. ఆ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు 11కేవీ ఫీడర్ పరిధిలోని సంఘమిత్ర కాలనీ, మారుతినగర్ ఎక్స్‌టెన్షన్, వైవీ శివారెడ్డి వెంచర్, సవీరా ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సంత ఆదాయం రూ.3.88 లక్షలు

అనంతపురం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పశువుల సంతతో స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు రూ.3,88,440 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌లో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2,32,870, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,55,570 వచ్చిందని తెలిపారు.

సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఎత్తివేసిన బెస్ట్ అవలబుల్ స్కూల్, ఎస్సీ కార్పొరేషన్ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప కోరారు. నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో అక్కులప్ప మాట్లాడారు. నాయకులు నారాయణ, చంద్ర, హనుమంతరాయుడు, రమేష్, లక్ష్మణమూర్తి, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెక్కు పంపిణీ

అనంతపురం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామానికి చెందిన చెరుకూరి తిరుపతి నాయుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఆయన కుటుంబానికి ఆదివారం నగరంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఏపీఎస్పీడీసీఎల్ సీజీఎం వరకుమార్ చేతుల మీదుగా రూ.5లక్షల పరిహార చెక్కును తిరుపతి నాయుడు భార్య శాంతమ్మకు అందజేశారు. విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, డీఈఈ శ్రీనివాసులు, ఏఈఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థుల వికాసంలో అవ్వతాతల పాత్ర కీలకం

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వికాసంలో అవ్వతాతలు కీలక పాత్రపోషిస్తారని కేంద్రీయ విద్యాలయం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మార్కండేయులు పేర్కొన్నారు. గ్రాండ్ పేరెంట్స్- 2024 పేరుతో విద్యార్థులు, ఉపాధ్యాయలతో ఒక రోజు అవ్వతాతల కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రాండ్ పేరెంట్స్ ఉపన్యాసాలు నిర్వహించారు.

వ్యక్తి అరెస్ట్

అనంతపురం క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యాడికి మండలం ఎం2ఎం సోషల్ మీడియా వింగ్‌కు చెందిన పరిమి వినోద్ కుమార్‌నాయుడు ఆదివారం తపోవనం సమీపంలో ఉండగా వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ సిబ్బందితో వెళ్లి అరెస్ట్ చేశారు. రెండు వర్గాలను, మతాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టేవిధంగా, రాజకీయ నాయకుల మీద దుష్ప్రచారం చేస్తూ అనంతపురం నగర ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాడనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఆటోడ్రైవర్‌పై దాడి

అనంతపురం క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ ఆటో స్టాండ్‌లో ఆదివారం ఆటోడ్రైవర్‌పై ఆర్టీసీ డ్రైవర్ దాడి చేశాడు. ధర్మవరం ఆర్టీసీ డిపో లో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఖాసీంవలి ఆది వారం అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్ మీదుగా రెండోరోడ్డుకు వెళ్తున్నాడు. రైల్వేస్టేషన్ ఆటోస్టాండ్‌కు రాగానే రెండో రోడ్డుకు వస్తావా అని ఆటో డ్రైవర్ ఆంజనేయులును అడిగాడు. రూ.50 అవుతుందని అతడు చెప్పాడు. 'నేను ఆర్టీసీ డ్రైవర్‌ను.. డబ్బులివ్వాలా?' అంటూ ఆంజనే యులును గద్దించాడు. ఆటోడ్రైవర్ ఆంజనేయులు కాలర్ పట్టుకుని లాగడంతో రోడ్డుపై పడ్డాడు. కాలు విరగడంతో ఆంజనే యులు సర్వజనాస్పత్రిలో చేర్చారు. ఖాసీంవలీని ఆటోడ్రైవర్లు అడ్డుకోకపోతే తీవ్రంగా గాయపడేవాడినని ఆంజనేయులు తెలిపాడు.

వెంకటాపురంలో ఉద్రిక్తత

బుక్కరాయసముద్రం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయంలో మండలంలోని వెంకటాపురం గ్రామంలో టీడీపీ కార్యకర్త నాగరాజు ఇంటికి అడ్డంగా అప్పట్లో వైసీపీ నేతలు నాటిన బండలను ఆదివారం కురబసంఘం నాయకులు, టీడీపీ నాయకులు తొలిగించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతవరణం చోటు చేసుకుంది. నాలుగేళ్ల క్రితం టీడీపీ కార్యకర్త కురబనాగరాజు ఇంటికి దారిలేకుండా ఇంటి చుట్టూ వైసీపీ నాయకులు దౌర్జన్యంగా బండలు నాటారు. అప్పట్లో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య తీవ్ర గొడవలు జరిగి ఇరువర్గాల మీద కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో గ్రామంలోని టీడీపీ నాయకులు, కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజినేయులు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్‌తో పాటు కురబ కులస్థులు నాగరాజు, ఈశ్వరయ్య, అక్కులప్ప, శ్రీనివాసులు తదితరులు ఆదివారం వెంకటాపురానికి వెళ్లి ఆ బండలను తొలిగించారు. సీఐ కరణాకర్, సిబ్బంది అడ్డుకున్నా, కురబ కులస్థులు లెక్కచేయకుండా వాటిని తొలిగించారు. ఈ సందర్భంగా రెండు వర్గాల మధ్య గొడవలు జరగకుండా పోలీసులు గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇరువర్గాలను స్టేషన్ వద్దకు పిలిపించి సీఐ మాటాడారు.

అనుమతుల్లేకుండా నిర్మాణాలు

- ఒకే భవనానికి సంబంధించి రూ.60 లక్షలు హాంఫట్
- నగరపాలిక ఆదాయానికి గండి
- ఇతర భవనాల సెల్లార్ల నిర్మాణంలోనూ రాజకీయ జోక్యం



ఫెర్రరనగర్‌లో నిర్మిస్తున్న భవనం

అనంతపురం క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలో అడ్డదిడ్డమైన కట్టడాలు అధిక మవుతున్నాయి. దీంతో కనీసం మురుగు తీయడానికి కాలువలు కూడా అందుబాటులో ఉండటం లేదు. భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా ఈ సమస్య కనిపిస్తోంది. ఇది ఒక ఎత్తయితే అక్రమ కట్టడాల వల్ల నగరపాలిక ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ప్రతి ఏటా ఆ నష్టం రూ.5కోట్ల పైమాటే ఉంటుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఈ నేపథ్యంలో అధికారులకు మామూళ్లు ముడుతుంటాయని, ఎల్‌టీపీల నుంచి కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారుల మధ్యలోనే ఈ తతంగం జరిగిపోతుంటుందనే విమర్శలున్నాయి. తాజాగా ఓ భవనం నుంచే నగరపాలిక ఆదాయానికి రూ. అర కోటిపైగా గండిపడింది. మరో భవనం సెల్లార్ విషయంలో అధికారులకు కాకుండా కేవలం రాజకీయనాయకులకే సొమ్ము వెళ్లినట్లు సమాచారం.

రూ. 60 లక్షలు హాంఫట్

అనంతపురం నగరంలోని ఫెర్రర్‌నగర్ పరిధిలోని బెంగళూరురోడ్డు ప్రధాన రహదారిలో ఆర్టీటీ కార్యాలయం ఎదుట ఓ భవనం నిర్మిస్తున్నారు. ఆ ప్రాంతం నాన్ అప్రూవల్ లేఅవుట్. అంటే ఆ ఏరియాలో ఏదైనా భవనం నిర్మించాలంటే అనంతపురం నగరపాలికకు 14శాతం బెటర్‌మెంట్ చార్జెస్ చెల్లించాలి. ఆర్టీటీ కార్యాలయం ఎదుట నిర్మిస్తున్న భవనం బాగా కమర్షియల్‌కు వాడేలా ఉంది. అందులో ప్రైవేట్ ఆసుపత్రి ఏర్పాటు చేస్తారని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం నాలుగో అంతస్తు నిర్మాణం జరుగుతోంది. దాదాపు 20 సెంట్లలో నిర్మిస్తున్న ఈ భవనానికి రూ.14శాతం చార్జెస్ కింద రూ.60లక్షలు చెల్లించాల్సి ఉంది. కానీ ఒక్క రూపాయి చెల్లించలేదని సమాచారం. ఇదే విషయంపై టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులను అడిగితే.. అలాంటిదేమీ లేదు... బెటర్‌మెంట్ చార్జెస్ కట్టేసి ఉంటారని చెబుతున్నారు. కానీ లేఅవుట్ ప్లాన్ (ఎల్‌పీ) నెంబరు అడిగితే పక్క చూపులు చూస్తున్నారు.

పెద్ద తిమింగలం సహకారం

ఈ భవనం వెనుక ఆ శాఖకు చెందిన ఓ పెద్ద తిమింగలం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. రాయలసీమ పరిధిలోని నగరపాలికలు, మున్సిపాలిటీల్లోని టౌన్ ప్లానింగ్ విభాగాలను పర్యవేక్షించే విభాగంలో పనిచేసే ఓ అధికారి ఈ వ్యవహారంలో పనిచేసినట్లు సమాచారం. ఆ బిల్డింగ్‌కు అప్రూవల్స్ విషయంలో ఆ బిల్డర్, ఎల్‌టీపీ నుంచి రూ.40లక్షల వరకు ఈ బిల్డింగ్ విషయంలో ముడుపుల బాగోతం నడిచినట్లు తెలిసింది. టౌన్‌ప్లానింగ్ అధికారులు సైతం ఉన్నతాధికారి కావడంతో కిక్కురుమనకుండా ఉంటున్నారట. కాగా ఆయన ఈ ఒక్క బిల్డింగే కాదు చాలా భవనాల విషయంలో ఇలా 14శాతం, జీప్లస్ 2కు అనుమతి తీసుకుని నాలుగంతస్తుల భవనం నిర్మించిన వాటిల్లో తలదూర్చినట్లు నగరపాలికలో కోడై కూస్తోంది.

సెల్లార్‌లో రాజకీయం

అరవిందనగర్‌లో కొత్తగా ఓ భవనం నిర్మిస్తున్నారు. ఆ భవనానికి వాస్తవానికి సెల్లార్ అనుమతి లేదు. కానీ సెల్లార్ తవ్వేసి, భవనం నిర్మించడానికి సిద్ధమవుతున్నారు. ప్రధాన రహదారిలోనే ఈ వింతచోద్యం చోటుచేసుకుంటోంది. ఈ బిల్డింగ్ విషయంలో అధికారులు తల దూర్చకముందే రాజకీయనాయకులు జోక్యం చేసుకున్నారట. పాలకవర్గం ఉండటంతో వైసీపీ నాయకులు, అధికారంలో ఉండటంతో టీడీపీ నాయకులు జోక్యం చేసుకున్నట్లు సమాచారం. వారికి పైసలు ముట్టడంతో.. ఏమీ అనవద్దంటూ అధికారులకు సూచనలు వెళ్లినట్లు సమాచారం ఆ బిల్డింగ్ నుంచి రూ.లకారాల్లోనే లబ్ధి పొందినట్లు తెలిసింది.



అరవిందనగర్‌లో నిర్మించిన సెల్లార్

సభ్యతపై మాట్లాడే అర్హత వైసీపీ వారికి లేదు

● వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్ల ఆగ్రహం

అనంతపురం అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భాష, సభ్యతపై వైసీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదని పలు కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు మండిపడ్డారు. నగరంలోని టీడీపీ అనంతపురం అర్బన్ కార్యాలయంలో ఆదివారం పద్మశాలి, నాయీబ్రాహ్మణ, రజక, వాల్మీకి కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు. కడియాల కొండన్న, పరమేశ్వర్, పీఎల్ఎన్ మూర్తి మీడియాతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతూ ప్రతి సారి మేయర్ వసీం అబద్ధాలు వల్లిస్తున్నారన్నారు. మీ అవినీతిపై ఇప్పటికే ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కలెక్టర్‌కు లేఖ రాశారన్నారు. ధైర్యం ఉంటే విచారణకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి సరళంగా మాట్లాడకపోయినా.. ఆయన మాట్లాడిన ప్రతి మాట వాస్తవమేనన్నారు.

కమీషన్లు చెప్పండి..: లక్ష్మీనరసింహ

అభివృద్ధి చేశామని మేయర్ వసీం చెబుతున్న పనుల్లో కమీషన్లు ఎంతో చెప్పాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ నిలదీశారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడా రు. మేయర్ వసీం తన స్థాయిని మరిచి ఎమ్మెల్యే దగ్గుపాటి, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అబద్ధాలు మాట్లాడటం, ఎమ్మెల్యేపై అనవసర విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

అవినీతిని బయటపెడతాం: మైనార్టీ నాయకులు

గత ఐదేళ్ల పాలనలో డబ్బు అంతా మీకు.. గబ్బు అంతా ప్రజలకా అని టీడీపీ మైనార్టీ నాయకులు మండిపడ్డారు. టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు ఫిరోజ్ అహ్మద్, తాజుద్దీన్, ముస్తాక్ ఆదివారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. మేయర్ వసీంతోపాటు ఆయన వెనుక ఉండి నడిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంత అవినీతిని త్వరలోనే బయటపెడతామన్నారు. ఏదైనా ముందు ఆలోచించి మాట్లాడితే బాగుంటుందని మేయర్‌కు హితవు పలికారు.

వీరశైవులను ఓబీసీలో చేర్చాలని సీఎంకు వినతి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వీరశైవ లింగాయతులను ఓబీసీలో చేర్చడం ద్వారా వారి అభ్యున్నతికి సహకారించాలని అఖిల భారత వీరశైవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శివానంద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును-కోరారు. వీరశైవ మహాసభ నాయకులు ఆదివారం విజయవాడలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. వీరశైవ సమాజం జిల్లా అధ్యక్షుడు యంజి రాజు, నాయకులు సతీష్‌కుమార్, బసవరాజు, సాంబశివుడు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు తగదు: అనంత

అనంతపురం క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలు నియంత్రిస్తామని, విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారని, వెంటనే పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్‌బిల్లుల భారం తగ్గించి సీఎం తన మాట నిలబెట్టుకోవాలన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోని నేమకల్లుకు వచ్చిన సీఎం చంద్రబాబు 5 టీఎంసీలతో ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణంతో ప ఆటు హెచ్ఎల్‌సీ ఆధునీకరణకు చర్యలు తీసుకుంటామని చెప్పడాన్ని జిల్లా వాసిగా స్వాగతిస్తున్నానన్నారు. ఇది మాటలకే పరిమితం చెయొద్దన్నారు.

డాక్టర్ తస్వీన్ కౌర్‌కు లండన్ ఎంఆర్‌సీఓసీలో సభ్యత్వం



లండన్‌లో సభ్యత్వం తీసుకుంటున్న డాక్టర్ తస్వీన్‌కౌర్

అనంతపురంటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలోని చంద్రా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మాత్రికాస్ ఫెర్టిలిటీ సెంటర్ డాక్టర్ తస్వీన్ కౌర్‌కు లండన్‌లోని ఎంఆర్‌సీఓసీలో అరుదైన సభ్యత్వం లభించింది. ఈ అవార్డును ఆదివా రం లండన్‌లో పొందినట్లు ఆమె తెలిపారు. ప్రసూతి, గైనకాలజీ రంగంలో నైపుణ్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఈసందర్భంగా డాక్టరు కౌర్ మాట్లాడుతూ పేదలకు సరసమైన ధరలతో నాణ్యమైన సంతానోత్పత్తి, సంరక్షణకు నిబద్ధతతో పనిచేస్తానన్నారు. ప్రత్యేకమైన పునరుత్పత్తి చికిత్సలను అందుబాటులోకి తీసుకు రావడమే తనలక్ష్యం అన్నారు. లండన్‌లో డాక్టరు కౌర్‌కు అరుదైన గౌరవం జిల్లాలలో మొట్టమొదటిసారిగా దక్కడం పట్ల చంద్రా ఆస్పత్రి ఎండీ డాక్టరు నిరంజనరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

సభ్యత్వ నమోదులో ముందుందాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు



సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో రాప్తాడు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఐదో స్థానంలో నిలపాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు నిచ్చారు. మండలంలోని ముత్యాలంపల్లిలో ఆదివారం ఆమె సభ్యత్వనమోదు గురించి గ్రామస్థులకు తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ....నియోజకవర్గంలో ఇప్పటివరకు 51వేలకు పైగా టీడీపీ సభ్యత్వం నమోదు చేయించారని, ప్రస్తుతం 15వ స్థానంలో ఉందన్నారు. సీకేపల్లి, రామగిరి, కనగానపల్లి, ఆత్మకూరు మండలాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. రాప్తాడు మండలం మొదటి స్థానంలో ఉందన్నారు. .65వేలకు పైగా సభ్యత్వ నమోదు చేయించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. అలాగే రామగిరి మండలంలో టీడీపీ సభ్యత్వనమోదు విస్తృతంగా సాగుతోంది.

టీడీపీ సభ్యత్వాల నమోదుకు రూ.లక్ష విరాళం



కల్లూరులో సభ్యత్వ నమోదు చేయిస్తున్న సామాల మధు

గార్లదిన్నె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో కార్యకర్త కుటుంబానికి భద్రత.... భరోసా ఉంటుందని తెలుగుయువత నాయకుడు సామాల మధు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు మండలంలోని కల్లూరులో రెండు రోజుల నుంచి టీడీపీ నాయకులు సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా సామాల మాట్లాడుతూ... కార్యకర్తల భవిష్యత్తు గురించి ఆలోచిం చేది ఒక్క తెలుగుదేశం పార్టీనే అన్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు తనవంతు సాయంగా సభ్యత్వాల నమోదుకు రూ.లక్ష విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. తెలుగుయువత నాయకులు సామాల రామాంజి, చింతావెంకట్రాముడు, ఐ రామకృష్ణ, శేషు, నలపరెడ్డి, రామాంజినేయాచారీ, పూజారి మాధవ, గణేష్, కిషోర్, నాగభూషణం, బెల్లం రామాంజినేయులు, గాజుల మాబు పాల్గొన్నారు.

● రాప్తాడు: మండలంలోని బొమ్మేపర్తిలో టీడీపీ సభ్యత్వ నమోదుకు తెలుగు యువత మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి రూ. 30 వేలు అందజేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

అనంతపురం క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని త్రీటౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం త్రీటౌన్ సీఐ శాంతిలాల్‌కు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఓ బెలోరో వాహనంలో 13.50క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. నగర శివారులోని టీవీ టవర్ ప్రాంతానికి చెందిన మజ్జిగ హరికృష్ణ జిల్లాలోని గుత్తి-గుంతకల్లు మధ్య ప్రాంతంలో పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసుకుని కర్ణాటకలోని కోలార్‌కు తరలిస్తుంటాడని సీఐ తెలిపారు. అతడితో పాటు డ్రైవర్ సాకే ప్రసన్నకుమార్, ఈశ్వరయ్యను అరెస్ట్ చేశామన్నారు.

16 నుంచి క్రికెట్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఈనెల 16వ తేదీ నుంచి ఎస్కే యూనివర్సిటీ స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్వీ డిగ్రీ పీజీ కళాశాల వైస్ చైర్మన్ చక్ర ధర్ రెడ్డి తెలిపారు. స్థానిక జీసెస్ నగర్‌లో ఉన్న ఎస్వీ డిగ్రీ పీజీ కళాశా లలో ఆదివారం నిర్వహించిన సమావే శంలో వైస్‌చైర్మన్ మాట్లాడారు. క్రీడా కారులను ప్రోత్సాహించేందుకు నిర్వహణ బాధ్యత తీసుకున్నట్లు తెలిపారు. తమ కళాశాలలో ఈ నెల 16న ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తామని, అనంతరం ఆర్డీటీ స్టేడియంలో క్రికెట్ పోటీలు 21వ వరకు కొనసాగుతాయన్నారు. ఎస్కే యూనివర్సిటీ పరిధి లోని అన్ని డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఈనెల 12వ తేదీ లోగా తమ కళాశాల పీడీ శ్రీనివాస్ నాయక్‌ను సంప్రదించి జట్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబరు 9849082178ను సంప్రదించాలని కోరారు.

అనంతపూర్ క్లబ్ అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.20లక్షలు

- కలెక్టర్ అనుమతి తర్వాతే ఎన్నికలు
- సర్వసభ్య సమావేశంలో తీర్మానం



సమావేశంలో నివేదిక ప్రవేశపెడుతున్న సెక్రటరీ కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అనంతపూర్ క్లబ్‌పై ఉన్న అపోహలను తొలగిస్తూ, దాని అభివృద్ధికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ రూ.20లక్షల నిధులు చెల్లించేందుకు ముందుకు రావడం అభినందనీయమని సెక్రటరీ కేశవ రెడ్డి తెలిపారు. స్థానిక సుభాష్‌రోడ్డులోని అనంతపూర్ క్లబ్‌లో ఆదివారం సీనియర్ సభ్యుడు, బార్ అసోసియేషన్ కౌన్సిల్ మెంబర్ రామిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. క్లబ్ సెక్రటరీ కేశవరెడ్డి కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. జిల్లా కలెక్టర్, క్లబ్ చైర్మన్ వినోద్‌కుమార్ అనుమతించిన వెంటనే క్లబ్ పాలకవర్గం ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. క్లబ్ అభివృద్ధికి అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ రూ.20లక్షల నిధులు చెల్లిం చడానికి ముందుకు రావడం అభినందనీయమని ఏకగ్రీవంగా తీర్మానించారు. క్లబ్ సభ్యులందరూ సమష్టిగా క్లబ్‌పై ఉన్న అపోహలు తొలగిస్తూ...అభివృద్ధి, సేవా కార్యక్రమాల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని తీర్మానంలో పేర్కొన్నారు. క్లబ్ సహాయ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి ఎంవీ పాండురంగయ్య, కార్యవర్గ సభ్యులు ఇక్రముద్దీన్, రమేష్‌కుమార్, మేడా రామ్‌నాథ్, ఇషాక్‌ఆలీ, రాజశేఖర్ రెడ్డి, గల్లా హర్ష, సీనియర్ సభ్యులు షకీల్‌షఫీ, సింగవరం రవి, రాయల్‌మురళీ, రవిశంకర్, జయచంద్రనాయుడు, ఆడిటర్ మేగా నాగరాజు పాల్గొన్నారు.


లాడ్జిలో పేకాట

● 14మంది అరెస్ట్

అనంతపురం క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ లాడ్జిలో పేకాడుతూ పలువురు పట్టుబడ్డారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యక్రమంలో పోలీసులు బిజీగా ఉంటారని ఒకాయన మిగిలిన వారిని ప్రోత్సహించారు. సీఎం కార్యక్రమం ముగిసినా కొనసాగించారు. ఎస్పీ ఆధ్వర్యంలో పనిచేసే ప్రత్యేక బృందం పట్టేసింది. ధర్మవరం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఆధ్వర్యంలో పేకాడుతుండగా శనివారం రాత్రి పోలీసులు దాడి చేసి 14మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.3.85 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. త్రీటౌన్ పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేశారు.



పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



నవయుగ కాలనీలోని పెద్దమ్మ

కార్తీక అమావాస్య పూజలు

ఆత్మకూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస అమావాస్యను పురస్కరించుకుని మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు రాముస్వామి ఆలయంలో మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు చేసి, అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదాన కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బాబు,సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

● అనంతపురం కల్చరల్: స్థానిక నవయుగ కాలనీలోని పెద్దమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌ను వేపమండలు, నిమ్మకాయల హారాలతో విశేషంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు రాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కేఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యలత

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని ప్రిన్సిపాల్ సత్యలత ప్రారంభించి మాట్లాడారు. జేఎన్‌టీయూ కళాశాల వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ మానహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, ఎన్ఎస్ఎస్ పీఓలు రామకృష్ణ, పాతిమున్నీసాబేగం, మేరి మాధురి, ఆర్ఆర్‌సీ కోఆర్డినేటర్ నీరజ, లక్ష్మి, సౌగంధిక తదితరులు పాల్గొన్నారు.

మెడికోల ఆధ్వర్యంలో...

అనంతపురంటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా మెడికోలు ఆదివారం ర్యాలీ చేపట్టారు. వైద్యకళాశాలలో ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. అనంతరం నగరంలో మెడికోలు ర్యాలీగా వెళుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. మెడికల్ కాలేజ్ డాక్టర్లు వేదాంతంకిషోర్, శంకర్, శ్రీదేవి, నీలిమాచౌదరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టరు పరదేశీనాయుడు పాల్గొన్నారు. అలాగే జిల్లా ఆస్పత్రి వైద్యాధికారులు, వైద్యులు ఎయిడ్స్‌డే సందర్భంగా ఆదివారం జిల్లా ఆస్పత్రి ఆవరణంలో బాధితులతో సమావేశం నిర్వహించారు. రెడ్‌క్రాస్‌సంస్థ, వీహెచ్ఎస్ సంస్థ, ఆలంబన సంస్థలు బాధితులకు పౌష్టికాహారం కిట్లు, బెడ్‌షీట్లు, దుస్తులు అందించారు. సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు డాక్టరు హేమలత, పద్మజ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ముఖ్య అతిథులుగా హాజరై బాధితులకు అందజేశారు. హెచ్ఐవీ బాధితులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఐఎంఏ అధ్యక్షుడు మురళీక్రిష్ణ, రెడ్‌క్రాస్ జీవన్, ఆలంబన జనార్దన్, అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గార్లదిన్నె : ఎయిడ్స్ డేని పురస్కరించుకుని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పీహెచ్‌సీ అవరణంలో సమావేశ నిర్వహించారు. వైద్యాధికారులు గౌతమి, మంజుల ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు.

● శింగనమల: ఎయిడ్స్ డే సందర్భంగా స్థానిక సీహెచ్‌సీ వైద్యురాలు పుష్పలత, ఎయిడ్స్ ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటపతి ఆధ్వర్యంలో ఆసుపత్రి నుంచి ఆర్‌టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది.

ఉత్సాహంగా సంగీత సాగర సమ్మేళనం



పాటలు పాడుతున్న సంగీత విద్వాంసురాలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని త్యాగరాజ సంగీత సభలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సంగీత సాగర సమ్మేళనం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కర్ణాటకకు చెందిన భాగ్యలక్ష్మీ కృష్ణ, రంజిని, తమిళనాడుకు చెందిన నిరంజన శ్రీనివాస్, సుకన్య రామగోపాల్, రమ్యా రమేష్ హాజరై శాస్త్రీయ సంగీతంతో వీనులవిందు చేశారు.

నగరంలో చైన్‌స్నాచింగ్

అనంతపురం క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని మారుతీనగర్‌లో ఆదివారం చైన్‌స్నాచింగ్ జరిగినట్లు నాలుగో పట్టణ ఎస్ఐ రాంప్రసాద్ తెలిపారు. శ్రీనగర్ కాలనీకి చెందిన ఈశ్వరమ్మ హౌస్ కీపర్‌గా పనిచేస్తుంటుంది. ఆదివారం ఉదయం మారుతీనగర్‌లోని సాయిబాబా గుడి వద్ద వెళ్తుండగా ఓ బైక్‌లో ఇద్దరు వచ్చారు. వెనుక కూర్చున్నవాడు ఆమె మెడలోని రెండుతులాల బంగారు గొలుసును లాక్కెళ్లినట్లు ఈశ్వరమ్మ నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఉద్యోగుల క్రికెట్ పోటీల్లో పలు జట్ల విజయం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల క్రికెట్ పోటీల్లో పంచాయతీరాజ్, కోఆపరేటివ్, పోస్టల్ జట్లు గెలుపొందాయి. ఏపీ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్, ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్‌ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఉద్యోగుల క్రికెట్ టోర్నీలో భాగంగా ఆదివారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో పోటీలు నిర్వహించారు. ఏపీ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్, ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్టు అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. మొదటి లీగ్ మ్యాచ్‌లో జేఎన్‌టీయూ నిర్ణీత 20ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 154పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన పంచాయతీరాజ్ జట్టు 19.3ఓవర్లలో కేవలం రెండు వికెట్లు కోల్పోయి 155పరుగులతో లక్ష్యాన్ని ఛేదించింది. మరో మ్యాచ్‌లో ...నిర్ణీత 20ఓవర్లలో అడ్వకేట్స్ జట్టు వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేసింది. అనంతరం పోస్టల్ జట్టు 17ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 155పరుగులతో గెలుపొందింది. మూడో మ్యాచ్‌లో... 16 ఓవర్లలో ఆర్టీసీ జట్టు 6వికెట్లు కోల్పోయి 126పరుగులు చేసింది. అనంతరం కోఆపరేటివ్ జట్టు 15.1ఓవర్లలో వికెట్ నష్టపోయి 128 పరుగులు చేసి గెలుపొందింది.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు స్పందన

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్-2024 పోటీలు ఆదివారం రామచంద్రనగర్‌లో ఉన్న సెయింట్ అగస్టీన్స్ చర్చి స్కూల్‌లో నిర్వహించారు. బాల, బాలికలకు అండర్-8, 10, 12, 14 కేటగిరీలలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 300మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఓపెన్ కేటగిరీలో అష్రాఫ్‌సుభాని మొదటి స్థానం, వెంకటరమణ ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలుర అండర్-8లో విగ్నేష్‌రెడ్డి, అండర్-10లో సాయి యషస్, అండర్-12లో రిషిక్, అండర్-14లో గురుచరణ్‌రెడ్డి, సీనియర్స్‌లో గోకుల్ కృష్ణ విజేతలుగా నిలిచారు. బాలికల విభాగం లో అండర్-8లో మనస్వి మల్కా, అండర్-10లో హారికచౌదరి, అండర్-12 యశస్విని, అండర్-14లో అనన్య, అండర్-18లో అఫ్రీన్‌ఖాన్ విజేతలయ్యారు. ఆర్బిటార్లు, కోచ్‌లు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

క్లుప్తంగా..

కనకదాస విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ


ఎమ్మెల్యేకు గొర్రెపిల్లను బహూకరించిన కురుబలు

కళ్యాణదుర్గం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదరంపల్లి గ్రామంలో భక్తకనకదాస విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదివారం రాత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కురుబలు ఎమ్మెల్యేకు గొర్రెపిల్లను బహూకరించారు. భక్తకనకదాస విగ్రహం ఏర్పాటుకు తోడ్పాటునందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇంతవరకు ఏ ఒక్కరూ తమ గ్రామంలో విగ్రహ ఏర్పాటుకు ముందుకు రాలేదని, ఇప్పుడు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ముందుకొచ్చి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఇందుకు ఆయనకు రుణపడి ఉంటామని అన్నారు. ఓబుళాపురం గ్రామంలో ఈనెల 5న నల్లలమ్మ ఆలయ ప్రారంభం కోసం గ్రామస్థుల వినతి మేరకు రూ.25 వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే వితరణ చేశారు.

నేడు పంపుహౌస్‌ పరిశీలన

బెళుగుప్ప, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాపురం, గంగవరం చెరువులతో పాటు కళ్యాణదుర్గం మండలంలోని పలు చెరువులకు హంద్రీనీవా నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు కోనాపురం సమీపంలో నిర్మించిన 11వ పంపుహౌస్‌కు విద్యుత్‌ సౌకర్యం కల్పించడానికి నూతన సబ్‌ స్టేషన్‌ నిర్మాణానికి మంత్రి పయ్యావుల కేశవ్‌ రూ. 2.71 కోట్లు మంజూరు చేశారు. దీంతో మండలంలోని పలు గ్రామాల రైతులు కలనేరనుంది. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌ పథకం వేగవంతానికి మంత్రి సోమవారం మండలంలో పర్యటించి పంపుహౌస్‌ను పరిశీలించనున్నారు. ఈక్రమంలో ఆ పంపుహౌస్‌ను టీడీపీ మండల నాయకులు ఆదివారం పరిశీలించారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుమ్మఘట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జే వెంకటంపల్లి గ్రామంలో ఆదివారం ఆంజనేయ స్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత అర్చకులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం రథోత్సవాన్ని నందికోలాటాల మధ్యన పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

గాయత్రీ ఆలయంలో గిరిజాకల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తాడిపత్రి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్‌లో ఉన్న వేదమాతగాయత్రీదేవి అమరలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్తీకమాసం అమావాస్యను పురస్కరించుకొని శివపార్వతులకు గిరిజాకల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతుల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య మంగళవాయిద్యాల నడుమ గిరిజాకల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవంను తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.

బాగా చదువుకోండి

● విద్యార్థులకు జేసీపీఆర్‌ సూచన


విద్యార్థులతో మాట్లాడుతున్న జేసీపీఆర్‌

తాడిపత్రి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయివిజేత పాఠశాలలో విద్యార్థుల కు మున్సిపల్‌ చైర్మన్‌ జేసీ ప్రభాకర్‌రెడ్డి పాఠాలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదువుకోవడంతో పాటు విజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ క్రమశిక్షణ, పెద్దలపట్ల గౌరవం, బంధుప్రీతి, సేవాగుణం కలిగి ఉండాలని తెలిపారు. కంఠస్తంగా చదువుకుంటే ఉద్యోగాలు రావని, తెలివితేటలు ఉపయోగిస్తే విజయం పొందుతారని పేర్కొన్నారు.

వైద్యశిబిరం

గుంతకల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాదులోని స్టార్‌ హాస్పిటల్స్‌ నేతృత్వంలో చేపట్టిన ఈ వైద్య శిబిరంలో 300 మంది పాల్గొని వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు గోపా జగదీశ్‌, కార్యదర్శి కృపాకర్‌, కోశాధికారి వెంకటేశులు, నాయకులు పాల్గొన్నారు.

30 కుర్చీల వితరణ

తాడిపత్రి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్‌ ఆధ్వర్యంలో నాయనపల్లి క్రాస్‌వద్ద ఉన్న కాశిరెడ్డినాయన ఆశ్రమానికి ఆదివారం 30 కుర్చీలను వితరణగా ఇచ్చామని అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. భోజనం చేసేవారి సౌకర్యం కోసం క్లబ్‌ తరఫున కుర్చీలను అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రఫీ, నవీన్‌, ప్రతాప్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం, రమేష్‌, రంగప్ప, భరత్‌, రామయ్య, నీలకంఠ, సత్యప్రసాద్‌రెడ్డి, ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ సమావేశం

తాడిపత్రి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూ పార్కులో ఆదివారం ఏఐటీయూసీ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, తాడిపత్రి ఇన్‌చార్జి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్‌, ఔట్‌సోర్సింగ్‌ కింద పని చేస్తున్న కార్మికులను రెగ్యులర్‌ చేయాలని డిమాండ్‌చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుప్రకారం కనీస వేతనం కింద రూ.26వేలు ఇవ్వాలన్నారు. స్కీమ్‌ వర్కర్లపై రాజకీయ, అధికార వేధింపులు ఆపాలన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. వచ్చేనెల 23, 24, 25తేదీల్లో నిర్వహించనున్న ఏఐటీయూసీ శిక్షణా తరగతులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వడ్డెర సంఘం జిల్లా కార్యదర్శిగా నారాయణస్వామి



బెళుగుప్ప, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురానికి చెందిన ఆలకుంట వడ్డే నారాయణస్వామిని ఉమ్మడి జిల్లా వడ్డెర సంఘం కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కేవీ వెంకటేశులు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఆదివారం అనంతపురంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. నారాయణస్వామికి వడ్డెర సంఘం నాయకులు దేవప్ప, తిమ్మప్ప, పెద్దన్న అభినందనలు తెలిపారు.

117 జీఓ రద్దు హామీని నిలబెట్టుకుంటాం

● ప్రభుత్వ విప్‌ కాలవ



సభలో మాట్లాడుతున్న విప్‌ కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఉపాధ్యాయులకు ఇచ్చిన 117 జీఓ రద్దు హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని ప్రభుత్వ విప్‌ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఆవరణలో ఆదివారం యూటీఎఫ్‌ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలను జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విప్‌ కాలవ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మెగా డీఎస్సీ విడుదలకు తొలి సంతకం చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. డీఎస్సీ ద్వారా కొత్త ఉపాధ్యాయులు చేరితే విద్యాప్రమాణాలు మెరుగుపడతాయని, తద్వారా సామాన్యుల పిల్లలకు మంచి విద్య అందుతుందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి స్నేహపూర్వకమైన వాతావరణం ఉంటుందని అన్నారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ ఎప్పటికప్పుడు ఉపాధ్యాయ సంఘాలతో చర్చిస్తూ ఆర్థిక భారం లేనివాటిని తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. బదిలీలు కూడా చాలా పారదర్శకంగా జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్‌ గేయానంద్‌ మాట్లాడుతూ సమాజం మీద, ప్రభుత్వాల మీద కార్పొరేట్ల పట్టు పెరిగి పోతోందని ధ్వజమెత్తారు. ఇలాంటి పరిస్థితుల్లో దీనిపై పోరాటాలు, ఉద్యమాలు చేసే ప్రజా సంఘాలకు యూటీఎఫ్‌ మద్దతు ఇవ్వాలని కోరారు. తొలుత యూటీఎఫ్‌ నాయకులు, ఉపాధ్యాయులు జూనియర్‌ కాలేజీ నుంచి వినాయక సర్కిల్‌ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్‌ రాష్ట్ర సహ అధ్యక్షుడు సురేష్‌, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్‌, యూటీఎఫ్‌ కార్యదర్శి కోటేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

విప్‌ కాలవకు ఘన సన్మానం

బొమ్మనహాళ్‌: ప్రభుత్వ విప్‌ కాలవ శ్రీనివాసులును మండలంలోని శ్రీధరఘట్ట గ్రామ రైతులు ఆదివారం ఘనంగా సన్మానించారు. సీఎం చంద్రబాబు శ్రీధరఘట్ట చెరువుకు తుంగభద్ర ఎగువ కాలువ నుంచి ప్రత్యేక కాలువ ఏర్పాటు చేసి సాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందుకు విప్‌ కాలవ సహకారం ఎంతో ఉందని సంతోషం వ్యక్తం చేస్తూ.. టీడీపీ మండల కన్వీనర్‌ బలరాంరెడ్డి ఆధ్వర్యంలో శ్రీధరఘట్ట రైతులు పెద్ద సంఖ్యలో రాయదుర్గం పట్టణంలోని కాలవ నివాసానికి వెళ్లి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అలాగే కేక్‌ కట్‌ చేశారు. సాధ్యమైనంత త్వరగా జీవోను తెచ్చేందుకు కృషి చేస్తానని కాలవ శ్రీనివాసులు తెలిపారు. మాజీ సర్పంచ్‌ గోవిందరెడ్డి, గ్రామస్థులు లారీ చంద్ర, రఘునాథ్‌రెడ్డి, కురుబ కృష్ణ, తిప్పేస్వామి ఎర్రిస్వామి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ మహమ్మారిని పారదోలుదాం

● వక్తల పిలుపు


గుత్తిలో ర్యాలీ..

గుంతకల్లుటౌన్‌, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైద్యఆరోగ్య శాఖ, ప్రగతి మైత్రి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎయిడ్స్‌ నివారణ ర్యాలీని నిర్వహించారు. ప్రపంచ ఎయిడ్స్‌ నివారణా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద వైద్యులు సుజాత, సుబ్బరాయుడు జెండా ఊపి అవగాహనా ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ కలుషిత సూదులు, సిరంజిలు వాడటంద్వారా, కలుషిత రక్తమార్పిడి వల్ల, సురక్షితం లేని లైంగిక సంపర్కం వల్ల ఈ వ్యాధి వస్తుందని తెలిపారు. హెచ్‌ఐవీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండి నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం ఎన్టీఆర్‌ సర్కిల్లో మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్‌ లేని సమాజాన్ని స్థాపిద్దామని నినాదాలు చేశారు. పీపీటీసీ కౌన్సిలర్‌ పీరానాయక్‌, ప్రాజెక్టు మేనేజరు రమేష్‌, డైరెక్టర్‌ నూర్జహాన్‌, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి, న్యాయసేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని స్థానిక సీనియర్‌ సివిల్‌ న్యాయమూర్తి కాశీవిశ్వనాథాచారి ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఎన్టీఆర్‌ సర్కిల్‌ మీదుగా గాంధీ చౌక్‌ వరకు ర్యాలీ సాగింది. న్యాయవాదులు గంగాధర్‌, నరసింహనాయుడు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. న్యాయాధికారి దుర్గా కల్యాణి జెండా ఊపి ప్రారంభించారు. టవర్‌క్లాక్‌ వరకూ ర్యాలీ చేపట్టారు. వైద్యులు ఇస్మాయిల్‌, డీపీఎంఓ తిప్పయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కణేకల్లు: కణేకల్లు క్రాసింగ్‌లో గల ఆర్డీటీ ఆసుపత్రిలో ఎయిడ్స్‌ నివారణపై ఆర్డీటీ వైద్యులు అవగాహన సదస్సును నిర్వహించారు. ఇందులో వైద్యులు శ్రీనివాస్‌, కిరణ్‌కుమార్‌, సాధన, సింధు, మేనేజర్‌ నాగరాజు, ల్యాబ్‌ టెక్నీషియన్స్‌ షేక్‌ఫజుల్‌ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్‌: మండలంలోని ఉద్దేహాళ్‌ గ్రామంలో ఎయిడ్స్‌ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది, గ్రామస్థులు ఆ వ్యాధి నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. హెల్త్‌ అసిస్టెంట్‌ గోవర్ధన్‌ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

గుత్తి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 3, 8వ వార్డుల్లో ఆదివారం టీడీపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సభ్యత్వం కలిగిన ప్రతి కార్యకర్తకు రూ.5లక్షల ప్రమాద బీమా అందించనున్నట్లు చెప్పారు. ఇంకా సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి పలువురితో సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో గుత్తిఆర్‌ఎస్‌ శాఖ అధ్యక్షుడు అబ్దుల్‌వహబ్‌, నాయకులు రమేష్‌, తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండల కేంద్రంలో టీడీపీ నాయకుడు చాంద్‌బాషా ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అలాగే మండలంలోని ఆయా గ్రామాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

బొమ్మనహాళ్‌: మండలంలోని గోవిందవాడలో టీడీపీ నాయకుడు సోమనాథ్‌ గౌడ్‌ ఆధ్వర్యంలో కార్యకర్తలు పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో బంగి లోకేష్‌, నటరాజ్‌, కురుబ చంద్ర, సుంకన్న, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

యల్లనూరు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరుకానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్‌ రామాంజనేయులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రజలు అర్జీలివ్వాలని కోరారు.

ఘనంగా లక్ష దీపోత్సవం


ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వెంకటరమణస్వామి

రాయదుర్గం టౌన్‌, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస అమావాస్య సందర్భంగా పట్టణంలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఆదివారం లక్ష దీపోత్సవాన్ని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఆలయంలో ప్రసన్న వెంకటరమణస్వామిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి లక్ష దీపోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా కార్తీక దీపాలు వెలిగించారు. దీప కాంతులతో ఆలయ ప్రాంగణమంతా కొత్త శోభను సంతరించుకుంది.

ఎక్స్‌కవేటర్‌ ధ్వంసం

తాడిపత్రి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపొలమడ ప్రబోధానంద ఆశ్రమానికి సంబంధించిన ఎక్సకవేటర్‌ను పప్పూరు రహదారిలో గుర్తుతెలియని దుండగులు రాళ్లతో దాడిచేయడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న రూరల్‌ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీని పరిశీలించారు. సంఘటనపై వివరాలు ఆరా తీశారు.

కల్తీ కల్లు దుకాణాలను రద్దు చేయాలి

తాడిపత్రి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి ప్రాంతంలో ఉన్న కల్తీకల్లు దుకాణాల అనుమతులను రద్దుచేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్‌ పేర్కొన్నారు. పట్టణంలోని నెహ్రూపార్కులో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాటాడారు. కల్తీకల్లు దుకాణాలకు ప్రభుత్వం ఏవిధంగా అనుమతులు ఇస్తోందో అర్థం కావడం లేదన్నారు. కల్లులో మత్తుపదార్థాలను కలుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. గతంలో కల్తీ కల్లు వల్ల నాగరాజు అనే వ్యక్తి మృతిచెందాడని గుర్తుచేశారు. తాడిపత్రి ప్రాంతంలో బెల్ట్‌షాపులు కూడా విచ్చలవిడిగా ఉన్నాయని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్‌ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి సీఎం చంద్రబాబు చేయూత

● చికిత్స కోసం రూ. పది లక్షల ఆర్థిక సాయం
● చొరవ చూపిన ఎమ్మెల్యే అమిలినేని


లిఖిత

కళ్యాణదుర్గం ,డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చిన్నారి లిఖిత చికిత్స కోసం సీఎం చంద్రబాబు రూ. పది లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రత్యేక చొరవ చూపారు. స్థానిక వెంకటమ్మ థియేటర్‌ వద్ద నివాసం ఉన్న శ్రవణ్‌ అనే వ్యక్తి పిండి మిషన్‌ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కుమార్తె లిఖితకు ఇటీవల డెంగీ జ్వరం వచ్చి ప్రాణానికే ముప్పు వాటిల్లింది. ఆపరేషన్‌ కోసం దాదాపు రూ. 20 లక్షలు అవుతాయని వైద్యులు చెప్పడంతో పేద కుటుంబం ఏమి చేయాలో అర్థం కాక చిన్నారి ప్రాణాలు కాపాడుకోవడానికి తల్లడిల్లారు. సోషల్‌ మీడియా ద్వారా విషయం ఎమ్మెల్యే తెలుసుకున్నారు. దీంతో ఆయన గత శనివారం నేమకల్లుకు వచ్చిన సీఎం చంద్రబాబు వద్దకు ఆ చిన్నారి తల్లిని తీసుకెళ్లి సమస్యను విన్నవించారు. ఆ తల్లి నా బిడ్డ ప్రాణాలు కాపాడండి సారూ అని సీఎంను వేడుకుంది. స్పందించిన చంద్రబాబు సాయం అందించాలని కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్‌ వెంటనే రూ. 10 లక్షల చెక్కును ఆమెకు అందజేశారు. దీంతో ఆ తల్లి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే అమిలినేనికి కృతజ్ఞతలు తెలిపింది.

శిథిలావస్థలో ఎంపీడీఓ కార్యాలయ భవనం

● పెచ్చులూడుతున్న పైకప్పు
● భయం.. భయంగా సిబ్బంది విధులు


పెచ్చులూడిన భవనం పైకప్పు

ఉరవకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు పెచ్చులు ఊడిపోయి ఇనుప చువ్వలు కనిపిస్తున్నాయి. వర్షం పడితే భవనం మొత్తం కారుతోంది. కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు కూర్చునే గదుల పైకప్పునకు కూడా పెచ్చులూడాయి. దీంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. ప్రజలు కూడా పెచ్చులూడుతుండడాన్ని చూసి భయం భయంగా కార్యాలయానికి వస్తున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. నూతన భవన నిర్మాణం కోసం జడ్పీ చైర్పర్సన్‌కు పలుమార్లు విన్నవించారు. అయినా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. కూటమి ప్రభుత్వమైనా నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదానం ప్రారంభం

కణేకల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గల అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం నుంచి మాలాధారులకు అన్నదానాన్ని ప్రారంభించినట్లు అన్నదాన ట్రస్టు ప్రధాన కార్యదర్శి రాంపా ప్రకాష్‌ తెలిపారు. జనవరి 10 వరకు అన్నదానం చేపట్టనున్నట్లు చెప్పారు .

కాశీవిశ్వేశ్వరుడికి భస్మాభిషేకం

● పాల్గొన్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌


కాశీవిశ్వేశ్వర సామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కాశీవిశ్వేశ్వరుడికి ఆదివారం అర్చకులు సుగంధద్రవ్యాలతో భస్మాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉజ్జయినిలో కార్తీక అమావాస్య సాయంత్రం 6గంటల అనంతరం సుగంధ ద్రవ్యాలతో మహా భస్మాభిషేకం నిర్వహిస్తారు. అదేవిధంగా తాడిపత్రిలో ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామికి ప్రతి ఏడాది కార్తీకమాసం అమావాస్యరోజున గణపతిపూజ, మహాపుణ్యావచనం, మహామంగళహారతి, మంత్రపుష్పం, మహానీరాజనం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. భస్మాభిషేకానికి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ జేసీ ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

తాడిపత్రి మండలం ఆలూరు గ్రామంలో గల పెద్దమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సందర్శించారు. ఆలయ 9వవార్షికోత్సవ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేకు అర్చకులు వేద ఆశీర్వచనాలతోపాటు తీర్థప్రసాదాలను అందించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం తిరుపాల్‌రెడ్డి ఇచ్చిన విందులో ఆయన పాల్గొన్నారు. నాయకులు కాకర్ల రంగనాథ, ఎంప రంగారెడ్డి, చింబిలి వెంకటరమణ, సంజీవపురం పవన్‌, హరినాథ్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గుమ్మఘట్ట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం, పూలకుంట గ్రామాల మధ్యలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరుమృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మహారాష్ట్రకు చెందిన మోహన్‌దగడపవర్‌ (77), దీపక్‌ పవర్‌తో పాటు మరో 20 మంది కూలీలు తాళ్లకెర సమీపంలో బొగ్గుల కాల్చేందుకు వలస వచ్చారు. కాగా ఆదివారం పని నిమిత్తం వారు బైక్‌పై వేపలపర్తికి వెళ్లి అనంతరం అక్కడి నుంచి తాళ్లకెరకు వస్తుండగా.. మార్గం మధ్యలో ఎదురుగా పూలకుంట గ్రామానికి చెందిన గొల్ల శివలింగ మరో బైక్‌పై వచ్చి ప్రమాదవశాత్తూ ఢీకొన్నాడు. దీంతో మోహన్‌దగడ పవర్‌ అక్కడికక్కడే మృతి చెందగా దీపక్‌పవర్‌, గొల్ల శివలింగకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం బళ్లారి, అనంతపురం ఆసుపత్రికి తరలించారు. గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుగుతున్నట్లు తెలిపారు.

రెండిళ్లలో చోరీ


ఫక్రుద్దీన్‌ ఇంటిలో బీరువాను పగలగొట్టిన దృశ్యం

తాడిపత్రి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిప్రొద్దుటూరు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున రెండిళ్లల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారని రూరల్‌ పోలీసులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాలమేరకు ఫక్రుద్దీన్‌ రెండురోజుల క్రితం ఎల్లార్తికి పోవడంతో ఇంటిలో ఎవరూలేని సమయం చూసి దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంటిలోకి చొరబడి బీరువాలో ఉన్న రూ.50వేలు నగదు, నాలుగు జతల బంగారు కమ్మలు, నాలుగు జతల గొలుసులు ఎత్తుకెళ్లారు. అలాగే సంగప్ప ఇంటిలోనూ ఎవరూ లేకపోవడంతో దుండగులు వెళ్లి బీరువాను పగలగొట్టి రూ.30వేలు నగదు తీసుకువెళ్లారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్‌పై నుంచి దూకి ఒకరి మృతి

యాడికి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): వెళుతున్న ట్రాక్టర్‌పై నుంచి కిందకు దూకడంతో మండలంలోని చింతలాయపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణ (43) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రామకృష్ణ ఆదివారం ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా వెళ్లాడు. కుందనకోట కొండల్లో నుంచి వీరారెడ్డిపల్లికి కొండరాళ్లను తరలిస్తున్నట్లు తెలిపారు. అయితే రాళ్లను లోడ్‌చేసుకొనే సమయంలో నిలిచి ఉన్న ట్రాక్టర్‌ ముందుకు కదలడంతో భయంతో రామకృష్ణ కిందకు దూకాడు. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం వెంటనే తాడిపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య రాజకుళ్లాయమ్మ, కుమారుడు జగదీష్‌ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు డివైడర్‌పైనే మృతి

తాడిపత్రి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అశోక్‌పిల్లర్‌ సమీపంలో ఉన్న డివైడర్‌పై ఆదివారం తెల్లవారుజామున సలాం (48) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక ఆటోనగర్‌కు చెందిన సలాం లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసకావడంతో భార్య జరీఫా విడాకులు తీసుకుంది. అప్పటి నుంచి ఒంటరిగానే జీవనం సాగిస్తున్నాడు. అతడు అనారోగ్యంతోనూ బాధపడుతున్నాడు. కాగా శనివారం రాత్రి మద్యం తాగి డివైడర్‌పై నిద్రించిన సలాం తెల్లవారుజామున చనిపోయినట్లు పోలీసులు గుర్తించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గంరూరల్‌, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదంగొల్లలదొడ్డి గ్రామానికి చెందిన పార్వతి అక్రమంగా కర్ణాటక మద్యాన్ని అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్‌ ఎస్‌ఐ పవన్‌కుమార్‌ తెలిపారు. గ్రామంలో అక్రమంగా కర్ణాటక మద్యాన్ని అమ్ముతున్నారని సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. ఇందులో పార్వతి అనే మహిళను అదుపులోకి తీసుకుని, ఆమె వద్ద నుంచి 50 కర్ణాటక ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆలయ హుండీ అపహరణ

కళ్యాణదుర్గం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామ చివర్లో ఉన్న బ్రహ్మం గారి ఆలయంలో హుండీ చోరీ జరిగింది. గత శనివారం రాత్రి దుండగులు ఆలయ తలుపులను పగులగొట్టి లోపలికి చొరబడి హుండీని ధ్వంసం చేసి అందులోని నగదును, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఆ ఆలయ కమిటీ సభ్యులు ఆ గ్రామ సర్పంచ్‌ సంధ్యారాణి, భర్త హరినాథ్‌ ఆదివారం ఉదయం తెలిపారు. హుండీని ఎత్తుకెళ్లి కంపచెట్లలో పడేసి వెళ్లారని, సుమారుగా రూ. 40 వేల నగదును గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ మధ్యకాలంలో మండలంలోని ప్రముఖ ఆలయాలలో దొంగతనాలు ఎక్కువయ్యాయని ఈ విషయమై పోలీసులు నిఘా వుంచి ఆలయాల సంపదను పరిరక్షించుటకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, మండల వాసులు కోరుతున్నారు.

నాటుసారా ఊట ధ్వంసం

కళ్యాణదుర్గం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కంబదూరు ఎక్సైజ్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని రాళ్లపల్లి గ్రామ శివార్లలో 600 లీటర్ల సామర్థ్యం కలిగిన నాటుసారా ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్‌ ఎస్‌ఐ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. డి చెన్నేపల్లి గ్రామంలో ఆనంద్‌ అనే వ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసి అతని వద్ద ఉన్న 34 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

25 గొర్రెల అపహరణ

యాడికి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుప్పాల గ్రామానికి చెందిన అశోక్‌, మునీంద్ర, భాస్కర్‌, రంగస్వామిలకు చెందిన 25గొర్రెలను దొంగలు అపహరించుకెళ్లారు. ఈ మేరకు బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. శనివారం రాత్రి పుప్పాల, వెంగన్నపల్లి గ్రామాల మధ్య ఉన్న ఒక రైతు పొలంలో గొర్రెల మందను ఉంచామని, అయితే అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మందలోకి చొరబడి 24గొర్రెలు, ఒక పెద్దపొట్టేలు అపహరించుకు వెళ్లినట్లు తెలిపారు. వీటివిలువ సుమారు రూ.4లక్షలు ఉంటుందని అన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు బాధితులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నందలపాడుకు చెందిన యల్లప్ప (45) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. యల్లప్ప రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెందిన అతను ఆదివారం ఇంటిలోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

యాడికి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విషపురుగు కాటుకు గురై చికిత్స పొందుతూ నారాయణ (48) అనే వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం జరిగింది. మండలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన నారాయణ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కాగా గత నవంబరు 29న పొలం వద్ద విషపురుగు కాటుకు గురయ్యాడు. యాడికిలోని ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. కర్నూలులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

యువకుడి మృతి..

బెళుగుప్ప, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలువపల్లి వద్ద పెన్నానది బ్రిడ్జి డివైడర్‌ను ఢీకొట్టి ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న అనంతపురం యువకుడు సురేష్‌ (23) ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 24న బైకుపై అనంతపురం వెలుతుండగా పెన్నానది బ్రిడ్జిని ప్రమాదవశాత్తు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైన సంగతి తెలిసిందే. తర్వాత కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు.